సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024

కర్ర, కత్తిసాములే ఆయుధాలు

- ఉవ్వెత్తున సాగిన ఆర్యసమాజ్ ఉద్యమం
- 1944లో నారాయణపేటలో భారీ ర్యాలీ
- నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల పోరు



వివరాలు 8లో..

గరిష్టం/కనిష్టం
33.6 /21.8

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజాపాలనకు ముస్తాబు

గద్వాల: ప్రజాపాలన వేడుకలకు సంబంధించి కలెక్టరేట్, అమరవీరుల స్థూపాన్ని ముస్తాబుచేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, అమరవీరుల స్థూపం, స్మృతివనం వద్ద ఉదయం 9:30 గంటలకు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఎలక్ట్రిసిటీ ఆర్టిసన్ జేఏసీ ఎన్నిక



గద్వాలటౌన్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిసన్ కార్మికుల నూతన జేఏసీ ఎన్నుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా పరమాల రాజు, సలహాదారుడిగా కుమార్, కన్వీనర్‌గా రామకృష్ణ, కోచైర్మన్‌గా శివప్రసాద్, కోకన్వీనర్‌గా అనంత్‌రెడ్డి, వైస్‌చైర్మన్లుగా అఖిల్ అహ్మద్, చంద్రమోహన్, జాయింట్ సెక్రటరీలుగా మద్దిలేటి, కృష్ణ, నవీన్‌కుమార్, కోశాధికారిగి లోకేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మాశన్న, నాగరాజు, వెంకట్రాములు, వాజీద్, రాముడు, రవి, సుధాకర్, పాండు ఎన్నికయ్యారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు గడువును ఈ నెల 23వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన కారణాల దృష్ట్యా దరఖాస్తు గడువును పొడిగించినట్లు వివరించారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులు మరో అవకాశంగా భావించాలని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు నవోదయ విద్యాలయ సమితి సూచించింది.

ఈత వనాలను పెంచాలి

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈత వనాలను పెంచి గీతా కార్మికులకు ఉపాధి పెంచాలని గౌడ సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో గతంలోని ఈత చెట్లను నరికేయడంతో స్వచ్ఛమైన కల్లు తీసేందుకు అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు. గ్రామాల్లో ఈత వనాలను నాటడంతో వాటి నుంచి ప్రకృతిలో మార్పులు రావడంతో పాటు, గీతా కార్మికులకు ఉపాధి పెరుగుతుందని, కల్తీ కల్లు అమ్మేందుకు అవకాశం ఉండదని అన్నారు. సంఘాలు, కార్మికుల లైసెన్సుల వారీగా ఈత వనాలను పెంచాలని కోరారు.

ఉద్యమకారులు



బెల్లం నాగన్న | తాళం బాలప్ప గూఢచారి | మాల కిష్టన్న | తెలుగు ఆశన్న | తంగేడి గంగన్న | ఈడిగి బాల్‌రాం | భీంరెడ్డి

వీరులారా.. వందనం



అప్పంపల్లిలో అమరవీరుల స్థూపం

తెలంగాణ పోరాటంలో పాలమూరు ఫిరంగులు

- నిజాం గుండెల్లో రణభేరి మోగించిన మట్టి బిడ్డలు
- వీరులతల్లి అప్పంపల్లిలో.. నెత్తుటి తర్పణం
- నైజాం సర్కారును ఎదురించిన అయిజ రైతులు

నిజాం రజాకార్లు ఊళ్ల మీద పడి దోచుకుంటున్న సమయమది. వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. భూమి కోసం, భుక్తి కోసం పేదల విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ఊళ్లన్నీ ఏకమయ్యాయి. బాంచన్ దొర నీ కాల్మొక్తా.. అని కట్టుకున్న చేతులు ఒక్కసారిగా తుపాకులు అందుకున్నాయి. మరికొందరు కారం పొడి, చేతి కర్రలు, బరిసెలనే ఆయుధాలుగా చేసుకుని నిరంకుశ నిజాం గుండాలతో ఎదురొడ్డిన పోరాటంలో ఎందరో నేలకొరిగారు. మరెందరో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. చివరికి నైజాం సర్కారును మట్టి కరిపించి స్వేచ్ఛావాయువును పీల్చుకున్నారు. పాలమూరు జిల్లా మొదటిసారి నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతులు సహాయక నిరాకరణ **ఉద్యమం చేపట్టారు. నాటి ఉద్యమం ఎంతో స్ఫూర్తి నింపింది.**

చిన్నచింతకుంట: ఆత్మకూర్ పల్లెల్లో రాజుకున్న చైతన్యం పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. 1947 అక్టోబర్ 7న భారీ ప్రదర్శనను అడ్డుకోవడంలో విఫలమైన పోలీసులు మహబూబ్‌నగర్ నుంచి అదనపు పోలీసు బలగాలను అప్పంపల్లికి తరలించారు.

ఉద్యమానికి ఊపిరి

- రజాకార్లను గడగడలాడించిన అప్పంపల్లి వీరులు
- అమరుల త్యాగాలకు సాక్షిగా నిలిచిన రావిచెట్టు


ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బెల్లం నాగన్న, బలరాంగౌడ్, తంగెడి నాగిరెడ్డి, తెలుగు **ఆశన్నలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఏక్షణంలోనైనా తమ నేతలను అరెస్టు చేస్తారని భావించిన అప్పంపల్లి గ్రామస్తులు రావిచెట్టు కింద గుమిగూడి చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన పోలీసులు భాష్పావాయువు** ప్రయోగించారు. **విడిది చేసిన ఇంటి కిటికీలో నుంచి ఉద్యమకారులపై కాల్పులు జరిపారు. ఈ** క్రమం**లో 11 మంది చాకలి కుర్మయ్య, ఈశ్వరయ్య,** తంగే**టి రాంరెడ్డి, నన్నేమ్మ, హరిజన్ కిష్టన్న, హరి**జన్ తిమ్మన్న, లక్ష్మారెడ్డి, పెండేం సాయన్న, గజ్జలన్న, బాల్‌రెడ్డి, వడ్డేమాన్ నర్సయ్య అక్కడికక్కడే నేలకొరగగా.. భీంరెడ్డి, మాల కిష్టన్న, ఈడిగి తిమ్మక్క, పెండెం కుర్మన్న, కె.రామచంద్రయ్య, వాగుల గంగన్నతోపాటు మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 29 మందిపై పోలీసులు చార్జీషీట్ వేసి జైలులో నిర్బంధించారు.



అమరవీరుల త్యాగాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన రావి చెట్టు

అమరవీరులకు గుర్తింపు ఏది?

రజాకార్లపై తిరుగుబాటు బావుట ఎగరవేసి ప్రాణాలు కోల్పోయిన అప్పంపల్లి అమరవీరులను స్వాతంత్య్ర సమరయోధులుగా గుర్తింపునకు నోచుకోలేకపోయారు. స్వాతంత్య్ర పోరాటం.. నిజాం వ్యతిరేక పోరాటం వేర్వేరు అని భావించిన ప్రభుత్వ వైఖరి ఏమిటో ఎవరికీ అంతుచిక్కడంలేదు. ఒకవైపు స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకుంటూ.. మరోవైపు నిజాం పోలీసు మూకలు సాగించిన అరాచకాలను ఎదురించి ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి. దుర్భర స్థితిలో ఉన్న అప్పంపల్లి అమరవీరుల కుటుంబాలను ఆదుకున్నప్పుడే తెలంగాణ విమోచన దినోత్సవానికి నిజమైన సార్థకత లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రజాకార్లు కాల్పులు జరిపిన ఇంటి కిటికి ఇదే..

ముందుండేవారు..



ఉద్యమాలు అంటే మా నాన్న ఎప్పుడూ ముందుండేవారు. ఎక్కడ ఉద్యమం జరిగినా అక్కడికి వెళ్లేవారు. నాలుగైదు రోజులపాటు అక్కడే ఉంటూ.. కనీసం ఇంటిని పట్టించుకునేవారు కాదు. పోలీసులు అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చేవారు. ఆ సమయంలోనే మాకు ఉన్న భూమిని కొంత అమ్మేశాడు. ప్రస్తుతం మా పరిస్థితి దీనంగా ఉంది. – గురువయ్యగౌడ్, ఉద్యమకారుని కుమారుడు, అప్పంపల్లి

చూస్తుండగానే నేలకొరిగారు..



తెలంగాణ పోరాటంలో మా గ్రామ నాయకుల **పాత్ర ఎంతో ఉ**ంది. నిజాం **సర్కారుకు** వ్యతిరేకంగా **ఎదురుతిరిగిన** వీరులు **బెల్లం నాగన్న,** ఈడిగి బాల్**రాంగౌడ్, తెలు**గు ఆశన్న, దాసర్‌పల్లి బుచ్చారెడ్డి **ఆత్మకూర్** సంస్థానంపై జాతీయ జెండా ఎగర**వేశారు. దీంతో** ఉద్యమకారులను పట్టుకోవడానికి **పోలీసులు** గ్రామానికి వచ్చారు. ఆ సమయంలో గ్రామం ఒక్కతాటిపైకి వచ్చింది. రజాకార్ల కాల్పుల్లో రావిచెట్టు కింద కూర్చున్న వారు చూస్తుండగానే ఒకరి తర్వాత ఒకరు నేలకొరిగారు. – బెల్లం సాయిలు, రిటైర్డ్ టీచర్, అప్పంపల్లి

చరిత్రకు సాక్ష్యంగా కాలాపాని జైలు

సాక్షి, నాగర్‌కర్నూల్: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిని శిక్షించేందుకు నల్లమలలోని మన్ననూరులో కాలపాని జైలు ఏర్పాటయ్యింది. స్వాతంత్య్ర సమరయోధులు, సాయుధ పోరాట యోధులను దండించేందుకు 1905లో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రత్యేకంగా మన్ననూరులో జైలును ఏర్పాటుచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని కాలపాని జైలు ఆనాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. నిజాం కాలంలో ఉద్యమకారులను ఇక్కడకు తీసుకువచ్చి చిత్రహింసలకు గురిచేసేవారు. బ్రిటిష్ కాలంలో అండమాన్ నికోబార్ దీవుల్లోని సెల్యూలార్ జైలును కాలపాని జైలుగా పిలవగా, నిజాం కాలంలో మన్ననూరులో ఏర్పాటైన జైలును సైతం కాలపాని జైలుగా పిలుచుకునేవారు.



మన్ననూరులోని నిజాంకాలం నాటి కాలపాని జైలు

పండిత్ నరేంద్రజీ ఇక్కడే బందీ..

నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆర్యసమాజ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన పండింత్ నరేంద్రజీ మన్ననూరు జైలులోనే బందీ అయ్యారు. 1938లో ఆయన్ను నిజాం బంధించి 17 నెలల 21 రోజుల పాటు శిక్షించారు. అనంతరం కాలంలో మన్ననూరు జైలును నరేంద్రజీ స్మారకంగా గుర్తించారు. ఆర్య ప్రతినిధి సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2004 సెప్టెంబర్ 17న కాలపాని జైలు ప్రాంగణంలో నరేంద్రజీ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. చారిత్రక ఘటనకు సాక్ష్యంగా నిలిచిన కాలపాని జైలు చరిత్రను నేటి తరాలకు తెలిసేలా ప్రభుత్వం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పోరాటాల పురిటిగడ్డ అయిజ

- లెవి సహాయ నిరాకరణోద్యమానికి బీజం పడింది ఇక్కడే..
- పోలీసు తూటాలకు నేలకొరిగిన ఐదుగురు రైతులు

అయిజ: నిజాం నవాబులు ప్రవేశపెట్టిన లెవి (ధాన్యం పన్ను) సహాయ నిరాకరణోద్యమానికి బీజం పడింది అయిజలోనే. నిజాం నవాబులు లెవి పన్నును ఆ రోజుల్లో తెలంగాణ రైతుల నుంచి సేకరించేవారు. అప్పటి పాలమూరు జిల్లాలోని అయిజ గ్రామంలో మొట్ట మొదటిసారిగా లెవి సహాయ నిరాకరణోద్యమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని మద్దిలేటి స్వామి ఆలయం ముందున్న రావిచెట్టు కింద గ్రామస్తులు ప్రతిరోజు సమావేశమయ్యేవారు. పోరాటానికి ఎప్పటికప్పుడు ప్రణాళిక తయారు చేసుకునేవారు.



అయిజలో గ్రామస్తులు సమావేశమైన రావిచెట్టు (ఫైల్)

వీరోచిత పోరాటం..

1947లో లెవి పన్నుకు వ్యతిరేకంగా అయిజ రైతులు నిజాం సర్కార్‌పై పోరాటం చేసేందుకు సిద్ధపడ్డారు. ఈక్రమంలో 1947 డిసెంబర్ 12న నవాబులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు రైతులు నేలకొరిగారు. అయిజకు చెందిన రైతులు నాయకి చిన్న తిమ్మప్ప, కల్లె బీచుగాడు, కొండాపురం నరసప్ప, పాగుంట వెకటయ్య, బలిజ నాగయ్య ప్రాణాలను నిజాం పోలీసులు బలితీసుకున్నారు. అయినా సరే ఇక్కడి రైతులు పోరాటాన్ని ఆపలేదు. ఆఖరికి వారి న్యాయమైన కోరిక నెరవేరి 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన అంతరించి ప్రజాస్వామ్య పరిపాలన అవతరించింది. నిజాం నవాబులకు వ్యతిరేకంగా అయిజ రైతులు పోరాడిన తీరు ఒల్లు గగుర్పొడిచేదిగా ఉండేదని ఎందరో వృద్ధులు గుర్తుచేసుకుంటున్నారు.

స్మరించుకోని పాలకులు

నిజాం సర్కారు తూటాలకు అయిజలో ఐదుగురు రైతులు నేలకొరగగా.. ఆ అమరవీరులకు గుర్తుగా 1955లో అయిజలోని సంతబజార్ కాలనీలో స్థూపాన్ని నిర్మించారు. అదే స్థూపాన్ని 1999లో ఆధునికీకరించి స్థూపంపైనే గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా లెవి ఉద్యమాన్ని లేవదీసి.. ఆ ఉద్యమంలో అమరులైన వారిని పాలకులు స్మరించుకోకపోవడం దురదృష్టకరమం. గాంధీ విగ్రహానికి నివాళులర్పించినప్పుడైనా నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులను స్మరించుకోక పోవడం శోచనీయమని ప్రజలు విమర్శిస్తున్నారు.

శాంతి పథం.. ఇస్లాం మార్గం

ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు



గద్వాలలో మిలాద్–ఉన్–నబీ ప్రార్థనలలో ముస్లింలు

గద్వాలటౌన్: ఇస్లాం మత స్థాపకుడు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు మిలాద్–ఉన్–నబీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం మర్కజి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. ఆదివారం రాత్రి స్థానిక ఒంటెలపేట కాలనీలోని మస్జిద్–ఏ–అన్వర్‌లో ఇషా నమాజ్ నిర్వహించారు. ఖురాన్ పఠనంతో జాగరణ వేడుకలు నిర్వహించారు. మిలాద్–ఉన్–నబి సందేశాలతో రాత్రంతా ముస్లింలు మసీదులలో గడిపి ప్రవక్త జన్మదినాన్ని స్మరించారు. మత పెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు అన్నదానాలు నిర్వహించారు.

మహ్మద్ ప్రవక్త శాంతిదూత..
ఇస్లాం అంటే శాంతి అని, మహమ్మద్ ప్రవక్త శాంతిదూత అని పలువురు మత పెద్దలు మౌలాన సయ్యద్ షా సుల్తాన మొహినుద్దీన్ ఖాద్రి, మౌలాన మిర్జఖైరుల్లా బేగ్ ఖాద్రి, మౌలాన మహ్మద్ షాకీర్ అహ్మద్ కౌసర్ ఖాద్రి పేర్కొన్నారు. సోమవారం ఉదయం మస్జిద్–ఏ– అన్వాన్‌లో చేపట్టిన కార్యక్రమంలో మత పెద్దలు మాట్లాడారు. ఆచారమేదైనా, మతమేదైనా మంచితనాన్ని ప్రవక్త కాంక్షించారన్నారు. అనంతరం శాంతి సందేశాన్ని ఇచ్చారు. మహమ్మద్ ప్రవక్త మార్గంలో నడవడమే ఇస్లాం అని పేర్కొన్నారు. విశ్వంలోని సకల మానవాళిలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను, చీకట్లను తొలగించి వారి జీవితాలను కాంతిమయం చేసి సన్మార్గంలో నడిపించడానికి మహమ్మద్ ప్రవక్త కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు షఫివుల్లా, జహంగీర్, బాబాతజమ్ముల్, రఫీ, పాష ఆమిరుద్దీన్, మహబుబ్, రఫీ, చాంద్‌పాష, ప్యారేమియా, పాష తదితరులు పాల్గొన్నారు.

20న డిప్యూటీ సీఎం, మంత్రుల రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లి సమీపంలోని శ్రీశైలం లెఫ్ట్ బ్యాక్‌వాటర్ టన్నెల్, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించేందుకు ఈ నెల 20న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ వస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. సోమవారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద హెలీప్యాడ్ స్థలం, ఇతర ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, రామనాథం తదితరులు ఉన్నారు.

ముంగిట్లో ముప్పు..!

చెంతనే జలాశయాన్ని నిర్మించిన ప్రభుత్వం ఆ గ్రామాన్ని పునరావాస కేంద్రంగా ప్రకటించడం మరిచింది. కృష్ణానది జలాలతో ఎప్పుడు నిండుకుండలా ఉండే ఆ రిజర్వాయర్‌తో భూగర్భ జలాలు పెరగడంతోపాటు.. ఇళ్లలోకి సైతం ఊట నీరు ఉబికి వస్తోంది. దీంతో ఇళ్లు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి దాపురించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రిజర్వాయర్ నిండుగా నీటితో కళకళలాడగా.. చెంతనే ఉన్న నాగర్‌దొడ్డి గ్రామంలోని దాదాపు 800 కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

- నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌తో ఇళ్లలో ఊరుతున్న నీరు
- నెర్రలుబారి శిథిలావస్థకు చేరిన భవనాలు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న నాగర్‌దొడ్డి గ్రామస్తులు
- పునరావాస గ్రామంగా ప్రకటించాలని వేడుకోలు

మల్దకల్: నాగర్‌దొడ్డి రిజర్వాయర్ నిర్మాణంతో తమ బీడుభూములకు సాగునీరందుతుందని సంబరపడిన నాగర్‌దొడ్డి గ్రామస్తులు, రైతులకు భవిష్యత్తులో తమ ఊరు ఉనికికే ముప్పు వాటిల్లుతుందని ఊహించలేకపోయారు. జలయజ్ఞంలో భాగంగా 2005లో మండలంలోని తాటికుంట 0.50టీఎంసీలు, నాగర్‌దొడ్డి సమీపంలో 0.40టీఎంసీల సామర్థ్యంతో రెండు రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టారు. అయితే నాగర్‌దొడ్డి సమీపంలో నిర్మించిన రిజర్వాయర్ కారణంగా దాదాపు 800కుటుంబాలు ప్రస్తుతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గ్రామ సమీపంలో ప్రభుత్వ అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్నాయనే ఉద్దేశ్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు రిజర్వాయర్ ఇక్కడ నిర్మాణం చేపట్టి నీటిని నింపుతూ వస్తున్నారు. గతంలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉండడంతో ఈ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉంచకపోవడంతో నాగర్‌దొడ్డి గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తివి కావు. ప్రస్తుతం రిజర్వాయర్ల సామర్థ్యం మేరకు నీటి నిల్వలు చేయడంతోపాటు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దమొత్తంలో రిజర్వాయర్‌కు నీరు చేరుకుంది. నాగర్‌దొడ్డికి చుట్టూ ఒక రిజర్వాయరు, రెండు నీటి కుంటలు ఉండడంతో భూగర్భజలాలు అధికమయ్యాయి.



నాగర్‌దొడ్డి గ్రామంలో ఇంటి ఆవరణలో వస్తున్న ఊటనీరును చూపుతున్న యజమాని

రాత్రులు జాగరణ

గ్రామంలో దాదాపు 800కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రిజర్వాయర్, కుంటలతో నీటి నిల్వ కారణంగా గ్రామంలోని ఎస్సీ, బీసీ, ఇతర కాలనీలలోని ఇళ్లలో నీటిమట్టం పెరిగి ప్రతి రోజు ఊటనీరు ఊరుతుంది. దీంతో రోజు వారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గ్రామస్తులు కొందరు ఉదయం ఇళ్లకు తాళాలు వేసి తమ పనులను ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికి ఇళ్లంతా జలమయం అవుతుండడంతో తీవ్ర



ఇళ్ల పునాదుల నుంచి వస్తున్న ఊటనీరు చూయిస్తున్న గ్రామస్తులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం పనులకు వెళ్లడం, రాత్రులు ఇంట్లోకి చేరిన నీటిని తోడేయడంతోనే తమ పని సరిపోతుందన్నారు. ఇళ్లలో నీళ్లు నిలిచి ఉండటంతో గోడలు నెర్రలు బారడంతోపాటు పునాదులు సైతం మెత్తబడుతున్నాయి. దీనికి తోడు ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇళ్లలో పడుకుంటే ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే ఆందోళనలో రాత్రుళ్లు జాగరణ చేస్తున్నామని గ్రామస్తులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా కలెక్టర్ సందర్శించినా..

ముంపు గ్రామంగా ప్రకటించి పునరావాసం కల్పించాలని గ్రామస్తులు అప్పటి ఉమ్మడి మహబూబ్‌నగర్ కలెక్టర్ ఉషారాణికి 2009లో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ గ్రామ సమీపంలోని రిజర్వాయర్‌ను సందర్శించి గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు ఏ అధికారి, ప్రజాప్రతినిధి తమ గోడును పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న అధికార, ప్రజాప్రతినిధులు తమ ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతుందని, వెంటనే పునరావాసం కల్పించాలని వేడుకున్నా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నాగర్‌దొడ్డి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఊట నీరు వస్తుంది



రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండటంతో గ్రామంలో భూగర్భజలాలు పెరిగి ఇళ్లలో నీరు ఊరుతుంది. ప్రతి రోజు నీటిని తోడేయడంతోనే సరిపోతుంది. నీటి ఊట కారణంగా ఇంటి పునాదులు దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. – రాజు, నాగర్‌దొడ్డి

ఉన్నతాధికారులకు నివేదించాం



నాగర్‌దొడ్డి గ్రామంలోని కొన్ని ఇళ్లలో నీటి ఊట వస్తుందనే విషయం మా దృష్టికి వచ్చింది. గ్రామస్తుల ధైర్యంగా ఉండాలి. తహసీల్దార్‌తో పాటు అధికారులు గ్రామంలో పర్యటించి పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించాం. ఈ విషయమై ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. – రామచందర్, ఆర్డీఓ, గద్వాల

క్లుప్తంగా

మద్యం మత్తులో యువకుడి బలవన్మరణం

శాంతినగర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ స్టేజీలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్ కథనం ప్రకారం.. జూలెకల్ స్టేజీలో నివాసం ఉంటున్న ఆటో రాఘవేంద్రశెట్టి కుమారుడు జగన్‌శెట్టి (22) మద్యానికి బానిసై.. ఇష్టానుసారం తిరిగేవాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనపై అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

మానవపాడు: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. మానవపాడుకు బోయ నరేష్(22) చదువుకోవడంతో పాటు పొలం పనులు సక్రమంగా చేయడం లేదని తండ్రి నర్సింహులు సోమవారం మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ పొలం దగ్గరకి వెళ్లి గడ్డి మందు తాగి.. ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే వారు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై నరేష్ తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడు..

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజీపేట మండలంలోని బుద్ధ సముద్రం గ్రామానికి చెందిన నారాయణగౌడ్ (70) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నారాయణగౌడ్ కుమారుడు పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో నారాయణ ఘటనను గుర్తు చేసుకుని తరుచూ దిగులు పడుతుండేవాడు. ఈ క్రమంలో మరింత మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. నారాయణకు భార్య, కుమార్తె ఉన్నారు.

రైలు ఢీ.. గుర్తు తెలియని మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని మహిళను రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం..దివిటిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని మహిళ(65) రైలు పట్టాలు దాటుతుంటే ప్యాసింజర్ రైలు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. రైలు ఆపి పైలెట్ 108కి కాల్ చేసి అందుబాటులోకి రాకపోవడంతో అదే రైలులో గాయపడిన మహిళను మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించాడు. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఎవరైనా కుటుంబసభ్యులు ఉంటే రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గండీడ్: ఆటో ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం గండీడ్ మండలంలోని పగిడ్యాల గ్రామానికి చెందిన పెద్ద కృష్ణయ్య కుమారుడు వడ్డె నర్సిములు(19) నాలుగు నెలల కిందట ఉపాధి నిమిత్తం ఆటోను కొనుగోలు చేశాడు. గిరాకీ లేక ఆటో కిస్తులు కట్టలేకపోయాడు. దీంతో మనస్థాపానికి గురై ఈ నెల 14న ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఉస్మానియ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ప్రాంతంలో మృతి చెందాడు. వడ్డే కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

తాగుడుకు బానిసై..

కోస్గి: పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణంలోని వినాయక్ నగర్‌కు చెందిన గౌరారం అనంతయ్య(40) కొన్ని సంవత్సరాలు మతిస్థిమితం కోల్పోయి తాగుడుకు బానిసయ్యాడు. అనారోగ్యం కారణంగా గతంతో రెండుసార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా సకాలంలో వైద్యం చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. మళ్లీ ఈ నెల 9న మరోమారు పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదేరోజు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ర, కత్తిసాములే ఆయుధాలు

- ఉవ్వెత్తున సాగిన ఆర్యసమాజ్ ఉద్యమం
- 1944లో నారాయణపేటలో భారీ ర్యాలీ

నారాయణపేట: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పాలమూరు ప్రజలు సాగించిన పోరులో ఆర్యసమాజ్ కీలకపాత్ర పోషించింది. నారాయణపేట ప్రాంతంలో 1947 – 49 కాలంలో కర్రసాము, కత్తిసాములను ప్రధాన ఆయుధాలుగా చేసుకొని ఉద్యమించారు. ఉమ్మడి పాలమూరులో ఉద్యమ నేతలను రజాకర్లు తుపాకాలతో కాల్చి చంపడంతో ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. ఎంతో మంది పోరాట యోధులను జైలుకు పంపించి, ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నించారు. అయితే 1948 సంవత్సరానికి ముందు జిల్లాలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ప్రజల్లో వచ్చిన చైతన్యంతో నిజాం పాలకులు ఈ ప్రాంతాన్ని విడిచివెళ్లినట్టు ప్రచారం సాగుతోంది.


నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన యువకులు (ఫైల్)

మత మార్పిడికి వ్యతిరేకంగా..

ప్రధానంగా అప్పట్లో ఖాసీం రజ్వీ అనే రజాకరు ఈ ప్రాంతంలో ఒక బృందాన్ని ఏర్పాటుచేసి, హిందూ మత మార్పిడి చేసేలా చర్యలు చేపట్టినట్లు పెద్దలు చెబుతున్నారు. మొదట్లో మత మార్పిడి కొంత మేరకు జరిగినా.. తర్వాతి కాలంలో ఉద్యమకారులు వ్యతిరేకించారు. మత మార్పిడికి వ్యతిరేకంగా ఆర్యసమాజ్ పోరాటం చేపట్టింది. కాలక్రమేణా స్వాతంత్ర్యం కోసం రజాకర్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధమయ్యారు. తమ వద్ద పదునైన ఆయుధాలు లేకపోవడంతో కత్తి, కర్రసాము యుద్ధవిద్యపై యువకులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దారు.

వేలాదిగా తరలివచ్చిన జనం..

నారాయణపేటలో నిజాం పాలనకు వ్యతిరేకంగా 1944లో హైదరాబాద్‌కు చెందిన సూరజ్ చంద్రోజీ, పండిత్ నరేంద్రజీ, నారాయణపేటకు చెందిన రాంచందర్‌రావు కల్యాణిల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. ర్యాలీ అనంతరం స్థానిక శాతవాహన కాలనీ ప్రాంతంలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఉద్యమకారులు ప్రతిపాదించారు. అయితే ర్యాలీకి నిజాం పాలకులు అనుమతి ఇవ్వలేదు. మొదట్లో అంతంతమాత్రంగా వచ్చిన జనం.. ఆ తర్వాత కట్టలు తెగిన ఉత్సాహంతో తరలివచ్చి, నిజాం పాలకులకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు.


నిజాంకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు కల్యాణి (ఫైల్)


నారాయణపేటలోని అప్పటి బాలాజీ టాకీస్ వద్ద నిజాంకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న జనం (ఫైల్)

యజ్ఞంతో ఏకం చేస్తూ..

ఆర్యసమాజ్ నేతృత్వం పేరిట గ్రామీణ ప్రాంతాల్లో తృతీయ మహాసభల చేపడుతూ.. యజ్ఞం పేరిట ప్రజలను ఒక చోటకు చేర్చి చైతన్యం నింపారు. ఆ సమయంలో ఆర్యసమాజ్ సభలు, సమావేశాలు నిర్వహించేందుకు నిజాం పాలకులు అనుమతి ఇచ్చే వారు కాదు. మహారాష్ట్రలోని సోలాపూర్ ఆర్య సమాజ్ కేంద్రాన్ని ఎంపిక చేసుకొని లోక కల్యాణం నిమిత్తం గ్రామాల్లో ప్రత్యేకంగా యజ్ఞాలు నిర్వహిస్తున్నట్లు నిజాం పాలకులను నమ్మించడంలో కొంత వరకు సఫలీకృతులయ్యారు. అదేవిదంగా యజ్ఞాల పేరిట ప్రజలను ఒక చోటకు చేర్చి నిజాం పాలకులను ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలను రచించారు.

సుండికే వారి నివాసంలోనే పాలన..

ఈ ప్రాంతంలో రజాకర్ల పాలన దర్గా రోడ్డులోని సుండికే వారి నివాసం నుంచే కొనసాగించినట్లు పెద్దలు చెబుతున్నారు. రజాకార్లు ఇక్కడ ఉంటూ.. తమకు వ్యతిరేకంగా ఎవరు ఉద్యమించినా అక్కడికి తీసుకెళ్లి శిక్షించే వారని పేర్కొంటున్నారు. ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నెలల తరబడి జైలులో ఉండి అనారోగ్యానికి గురికావడం జరిగిందని చెబుతున్నారు.

ప్రాణాలు సైతం లెక్కచేయక..


- నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన రాఘవేందర్‌రావు

మక్తల్: నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి.. రజాకార్ల ఆకృత్యాలను ఎదిరించేలా.. దాదాపు 300మందితో కూడిన బలగంలో ఆత్మవిశ్వాసం పెంచి.. ప్రాణాలు సైతం లెక్కచేయక పోరాటం చేసిన యోధుడు.. రాఘవేందర్‌రావు. దేశంలో తెలంగాణను విలీనం చేసేందుకు నిజాం పాలకులు ఒప్పుకోకపోవడంతో వారికి వ్యతిరేకంగా తెలంగాణ విమోచన పోరాటం చేసేందుకు నాటి మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నారాయణపేటకు చెందిన న్యాయవాది వృత్తి చేపట్టిన రాఘవేందర్‌రావు ముందుకు వచ్చారు. దేశంలో అంతర్భాగాన తుంగభద్ర నదీ తీరాన ఉన్న ఆదోని జిల్లాలోని రాంపూర్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 300మంది సమరయోధులతో సమావేశాలు ఏర్పాటుచేశారు. రజాకార్లు గ్రామాల్లో ప్రజలను వేధింపులకు గురిచేస్తుండగా.. ధైర్యంగా ముందుకు వచ్చి తన అనుచరులతో పోలీస్‌స్టేషన్లపై దాడులు, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం.. ఆయుధాలను ఎత్తుకెళ్లడంలో దిట్టగా పనిచేశారు. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి భూమి పన్ను కట్టరాదని తెలియజేశారు. న్యాయవాది వృత్తిని, తన కుటుంబ సభ్యులను వదిలి రజాకార్లకు వ్యతిరేకంగా ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారు. కొంతమంది నిజాం పాలకులు రాఘవేందర్‌రావును చంపేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. అతడిని పట్టుకుంటే 5000 ఉస్మానియా చిక్క నజరానా ఇస్తామని నిజాం పాలకులు ప్రకటించారు. రాఘవేందర్‌రావు దొరక్కపోవడంతో అతడి తమ్ముడు శ్రీనివాస్‌రావు ఇంట్లో ఉండగానే అరెస్టు చేసి జైలులో బంధించారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రాఘవేందర్‌రావు పనితీరును పలువురు అభినందించారు. ఇదిలాఉండగా, ఆయన కుమారుడు దివంగత కిషన్‌రావు న్యాయవాది వృత్తిలో కొనసాగగా.. ప్రస్తుతం ఆయన మనుమడు వెంకట్‌రావు సైతం అదే వృత్తిలో ఉన్నారు. హైదరాబాద్‌లో ఉంటూనే.. మక్తల్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ప్రజలకు ఉచిత సేవలు అందిస్తూ తాత పేరు నిలబెడుతున్నాడు.


రాఘవేందర్‌రావు, న్యాయవాది


ఆదోని క్యాంపులో రాఘవేందర్‌రావు, ఆయన అనుచరులు

నిజాం వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం..


నాగర్‌కర్నూల్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అంబటి చంద్రశేఖర్

సాక్షి, నాగర్‌కర్నూల్: నిజాం వ్యతిరేక పోరాటంలో ఆనాటి ఉద్యమకారులు ఎందరో నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన అంబటి చంద్రశేఖర్ ఆనాటి ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారుడు పాగ పుల్లారెడ్డి సారథ్యంలో పోరాటంలో పాల్గొని మూడు సార్లు జైలుజీవితం గడిపాడు. కర్నూలులో ఏర్పాటుచే సిన శిబిరంలో శిక్షణ పొంది హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం పోరాటం చేశారు. ఈ క్రమంలో 11 నెలల 22 రోజుల పాటు జైలు శిక్షను అనుభవించారు. స్వాతంత్ర్యం అనంతరం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిరోసిన్ కార్పొరేషన్ సభ్యుడిగా, హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా సేవలందించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటులో కీలక పాత్ర వహించారు. జిల్లాకేంద్రంలో సినిమా థియేటర్లను స్థాపించడంతో స్థానికులు ఈయన్ను 'సినిమా శేఖరయ్య'గా పిలుచుకునే వారు. 2013 ఏప్రిల్ 26న మరణించారు.

ఉద్యమంలో పాగ పుల్లారెడ్డి కీలకపాత్ర


స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే పాగ పుల్లారెడ్డి

నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాగ పుల్లారెడ్డి కీలక పాత్ర వహించారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన పాగ పుల్లారెడ్డి 1919 మే 2న జన్మించారు. 1947–48 కాలంలో నిజాం సంస్థానం నుంచి విముక్తి కోసం ఆనాటి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. సర్దార్ గౌతు లచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సైనిక శిబిరంలో శిక్షణ పొందారు. కర్నూలు కేంద్రంగా నిర్వహించిన శిబిరానికి మార్గదర్శకుడిగా వ్యవహరించారు. స్వాతంత్ర్యానంతరం 1952లో గద్వాల ద్విసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నటరాజు రామకృష్ణ కళాక్షేత్రాన్ని స్థాపించి లలిత కళల అభివృద్ధికి ఇతోధికంగా కృషిచేసిన పుల్లారెడ్డి 2010 అక్టోబర్ 20న మరణించారు.

వన్యప్రాణులను కాపాడటంపై అవగాహన


చిరుత పులి (బొమ్మ)తో ప్రయోగాలను చేస్తున్న రెస్క్యూ టీం సభ్యులు

మన్ననూర్: వన్యప్రాణులకు మనుషుల సహాయం అవసరమైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై పుణె రెస్క్యూ టీం ఆధ్వర్యంలో సోమవారం మన్ననూర్‌లోని ఈసీ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బొమ్మ చిరుత పులిపై ప్రయోగాత్మకంగా వివరించారు. ముఖ్యంగా వన్యప్రాణులు ప్రత్యేకించి క్రూరమృగాలు ప్రమాదానికి గురైనప్పుడు, తల్లి నుంచి పిల్లలు విడిపోయినప్పుడు, జనసంచారంలోకి వచ్చినప్పుడు తగు జాగ్రత్తలను తీసుకుని వాటిని అదుపులోకి తీసుకోవడంతోపాటు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తిరిగి అటవీ ప్రాంతంలోకి ఏ విధంగా పంపించాలనే వాటిపై అమ్రాబాద్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌ఆర్‌ఓ, ఎఫ్‌ఎస్‌ఓ, బీఎఫ్‌ఓ, ఎస్‌జీఓలు ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ప్రస్తుతం ఇది వరకే ఉపయోగిస్తున్న పలు పరికరాలతోపాటు సునాయసంగా పని ముగించేందుకు అవసరమైన కొత్త పరికరాలను పరిచయం చేశారు. శిక్షణ కార్యక్రమం మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని అటవీశాఖ ఎడ్యుకేషనల్ అధికారి శ్వేత తెలిపారు.

ప్రకృతి దైవంతో సమానం



జడ్చర్ల టౌన్: ప్రకృతి దైవంతో సమానమని, ఓజోన్‌పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తిరువణ మలై రామకృష్ణమఠం స్వామీజీ ధ్యానానంద పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల బొటానికల్ గార్డెన్‌ను ఆయన సందర్శించారు. ఓజోన్ దినోత్సవం రోజున గార్డెన్ సందర్శన సంతోషంగా ఉందని అన్నారు. ప్రకృతిని రక్షించుకునేందుకు కృషిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం రీసెర్చ్ ల్యాబ్‌లో సంరక్షిస్తున్న పాములను చూసి వాటి గురించి తెలుసుకున్నారు. అంతకుముందుకు ఆయనకు గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య స్వాగతం పలికారు.

నర్సు అనుమానాస్పద మృతితో జడ్చర్లలో విషాదం


శ్రుతి (ఫైల్)

జడ్చర్ల: పట్టణానికి చెందిన యువతి శ్రుతి(23) హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని రెడ్‌స్టోన్ హోటల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం కుటుంబసభ్యుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. నారాయణపేట జిల్లా కోస్గి మండలం కడెంపల్లికి చెందిన దంపతులు వెంకటయ్య, సువర్ణ ఐదేళ్ల క్రితం జడ్చర్లకు వలస వచ్చారు. కావేరమ్మపేటలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలలో దినసరి కూలీలుగా పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురు శ్రుతి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రితో నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి హోటల్‌లో అనుమానాస్పదంగా మృతి చెందడంతో కావేరమ్మపేటలోని శ్రుతి నివాసం చుట్టు పక్కల వారు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

లోతుగా దర్యాప్తు చేయాలి: ఎమ్మెల్యే

శ్రుతి మరణంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆమె మరణంపై గచ్చిబౌలి పోలీసులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు అత్యాచారం, హత్యగా అనుమానిస్తున్న నేపథ్యంలో లోతుగా దర్యాప్తు చేసి నిజనిజాలను వెలికి తీసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాల 8వ తరగతి చదువుతున్న విశాల్(15) సోమవారం నల్ల చెరువు బ్యాక్ వాటర్‌లో ఈతకు వెళ్లి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. వనపర్తి పట్టణ ఎస్ఐ2 రామరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం, తాటికుంటకు చెందిన విశాల్(15) వనపర్తి పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ.. పాఠశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం హాస్టల్ నుంచి ముగ్గురు విద్యార్థులతో కలిసి నల్లచెరువు బ్యాక్ వాటర్‌లో ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటనపై తల్లి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలియజేశారు.

తల్లి బాగోగులు చూడని కొడుకుపై కేసు నమోదు

గద్వాల క్రైం: వయస్సు మీదపడిన తల్లి బాగోగులు చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొడుకుపై కేసు నమోదు చేసినట్లు దైనట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. గద్వాల పట్టణానికి చెందిన అక్కల రత్నమ్మ(70)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు చంద్రశేఖర్ ఉన్నారు. గత రెండేళ్లు తల్లి బాగోగులు చూడకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. జబ్బు చేసి మంచాన పడినప్పటికీ కుమారుడు కర్కశంగా వ్యవహరించాడన్నారు. ఈ విషయమై కలత చెందిన ఆమె కుటుంబ సభ్యుల సహాయంతో సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కుమారుడిపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



కొత్తకోట రూరల్: అతి వేగంగా బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు అదుపు తప్పి కల్వర్టును ఢీకొని కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం ముమ్మళ్లపల్లి ఎన్‌హెచ్ 44పై చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూర్‌కు చెందిన రోహన్(36) రెండు రోజుల కిందట తన స్పోర్ట్స్ బైక్‌పై హైదరాబాద్‌కు వచ్చాడు. తిరిగి సోమవారం బెంగళూర్‌కు వెళ్తుండగా.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి జాతీయ రహదారి 44పై బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే సిబ్బంది మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్: ఒకరి మృతి మరొకరికి తీవ్ర గాయాలు

ఉండవెల్లి: ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరి మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఉండవెల్లి నుంచి కర్నూల్ మార్కెట్ యార్డుకు ఉల్లిగడ్డల లోడుతో ట్రాక్టర్ వెళ్తోంది. కర్నూల్ జిల్లా వెల్దుర్తి మండలం ఎల్ బండ గ్రామానికి చెందిన షేక్ సుబాన్, అబ్దుల్లాలు ఇటిక్యాలపాడులో పనులు ముగించుకొని తిరుగుప్రయాణం అయ్యారు. ఉండవెల్లి శివారులోని జాతీయ రహదారిపై ఉల్లిగడ్డల ట్రాక్టర్‌ను వెనుకనుంచి బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ సుబాన్(25) అక్కడికక్కడే మృతి చెందినట్లు, అబ్దుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని ఏఎస్ఐ సుబ్బారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వీరన్న పరిశీలించారు. మృతదేహాన్ని అలంపూర్ మార్చురీకి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.


ఘటనా స్థలంలో వాహనాలను అదుపు చేస్తున్న పోలీసులు


హుండీ చోరీ

జడ్చర్ల: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న లలితాంబిక తపోవనంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని ఇద్దరు దొంగలు ఆలయంలోకి ప్రవేశించి ఆలయం గర్భగుడి ఎదుట ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించి ఆలయంలో, ఆలయం బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సీసీ ఫుటేజీలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా హుండీలో ఎంత మొత్తం ఉందో అంచనా వేయాల్సి ఉంది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు.



బానిస బతుకులే.. బందూకులైనయ్..

మీర్ ఉస్మాన్ అలీఖాన్ సుదీర్ఘ పాలన (1911–1948) సమయంలో హైదరాబాద్ రాజ్యంలో అరాచకాలు పెరిగిపోయాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ, పోలీస్ వ్యవస్థలన్నీ నిజాం నవాబు ఫర్మానాలకు లోబడే పనిచేసేవి. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండే, పటేల్, పట్వారీలు ఊరికో నియంతలా మారిపోయారు. దీనికి తోడు ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్ (ఉర్దూలో స్వయం సేవకులు అని అర్థం) బృందాలు రెచ్చిపోయి హత్యలు, లూటీలకు తెగబడ్డాయి. ప్రతి గ్రామంలో వారానికో రోజు రజాకార్లు సమావేశమై ఆయుధాలతో మార్చ్‌ఫాస్ట్ చేసేవారు. రాజ్యంలో సంస్థానాలు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, పటేల్, పట్వారీ వ్యవస్థలు రైతుకూలీలను పీల్చి పిప్పిచేశాయి. అయితే స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి, ఆంధ్ర మహాసభలు తెచ్చిన చైతన్యంతో హైదరాబాద్ రాజ్యంలో సాయుధ రైతాంగ పోరాటం మొదలైంది. 1946 జూలై 4న అప్పటి నల్లగొండ జిల్లా కడవెండిలో విసునూరు దేశ్‌ముఖ్ ఇంటిమీదుగా వెళ్తున్న జులూస్‌పై రజాకార్లు పేల్చిన తూటాలకు దొడ్డి కొమురయ్య హతమయ్యాడు. దాంతో రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలోని సేనలు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న కోఠిలో జాతీయ జెండాను ఆవిష్కరించే ప్రయత్నం చేసిన రామానందతీర్థను నిజాం సేనలు జైల్లో వేశాయి. నిజాం నిరంకుశ పాలనపై వార్తలు రాస్తున్న ఇమ్రోజ్ పత్రిక ఎడిటర్ షోయబుల్లాఖాన్‌ను 1948 ఆగస్టు 22న రజాకార్లు హత్య చేశారు. అన్ని జిల్లాల్లోనూ ప్రశ్నించిన వారిపై, నిజాంకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దారుణకాండకు పాల్పడ్డారు. ఈ హింసను నిరసిస్తూ హిందూ మహాసభ, స్టేట్ కాంగ్రెస్ సైతం సత్యాగ్రహ పోరాటాలు చేపట్టాయి. భారత ప్రభుత్వం హైదరాబాద్ అంశంపై దృష్టి సారించి 1948 సెప్టెంబర్ మొదటి వారంలో పోలీస్ యాక్షన్ చేపట్టింది.


సాయుధ పోరాట సాధనలో మల్లు స్వరాజ్యం తదితరులు


రజాకార్లు

ప్రపంచస్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి

- హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీలో పర్యటించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు
- రూ.2 వేల కోట్ల పెట్టుబడులతో రెండు ఫార్మా ల్యాబ్‌లను ప్రారంభించిన మంత్రి

శామీర్‌పేట్: హైదరాబాద్‌ను ప్రపంచస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీ ఫేస్ 1లో సోమవారం ఆయన పర్యటించారు. జీనోమ్‌వ్యాలీలో అధునాతన సర్టిఫైడ్ లైఫ్ సైన్సెస్ 3 జీవిని ఆయన ప్రారంభించారు. అనంతరం సైనోపోలిస్‌లో నిర్వహించిన కనెక్ట్ 2024 కార్యక్రమంలో పాల్గొని ప్రముఖ ఫార్మా దిగ్గజాలైన 60 మంది ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... జీనోమ్‌వ్యాలీలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తుండడంతో అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల మౌలికవసతులు కల్పిస్తామని వివరించారు. ప్రపంచ ఫార్మా దృష్టిని హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీ ఆకర్షించేలా అత్యాధునిక ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. పెట్టుబడులు రాబట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులోభాగంగానే జీనోమ్‌వ్యాలీని సందర్శించి ఫార్మా దిగ్గజాలతో సమావేశమైనట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. అనంతరం రూ.2 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న కర్కల్యాబ్స్, లారస్ ల్యాబ్స్ పనులను ఆయన ప్రారంభించారు.

2035 నాటికి 40000 మెగావాట్ల గ్రీన్ పవర్

- రాష్ట్రంలో ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి
- హరిత విద్యుత్‌లో పెట్టుబడులకు తెలంగాణ సరైన వేదిక
- ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి త్వరలో కొత్త విధానం తెస్తాం
- గుజరాత్‌లో నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ సదస్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సౌర విద్యుత్ రంగంలో పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. గుజరాత్ గాంధీనగర్‌లో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ప్రారంభమైన నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సదస్సులో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో సహజ వనరులతోపాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, టీఎస్–ఐపాస్ వంటి సరళీకృత వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రీన్ పవర్ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రం సరైన వేదిక అని తెలిపారు. 300 రోజులకుపైగా సూర్యరశ్మి లభ్యత ఉంటుందని, 26.4 గిగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తికి అవకాశముందన్నారు. దేశంలో బలంగా గాలులు వీచే మొదటి 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని చెప్పారు. సుమారు 54 గిగావాట్ల పవన విద్యుదుత్పత్తికి అవకాశముందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశముందని వెల్లడించారు. ఇతర రిజర్వాయర్లు, పాడుబడిన గనుల్లో సైతం ఈ ప్రాజెక్టులు చేపట్టవచ్చన్నారు. రాష్ట్రంలో 1500–3000 మెగావాట్ల హైడ్రోజన్, జియోథర్మల్, 250 మెగావాట్ల మినీ హైడల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశముందని చెప్పారు.

దేశ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు సహకారం

రాష్ట్రంలో గ్రీన్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి త్వరలో కొత్త విధానాన్ని ప్రకటిస్తామని



భట్టి విక్రమార్క వెల్లడించారు. అద్భుత ఆర్థిక వ్యవస్థతో ఐటీ, ఔషధ రంగాల్లో మేటిగా నిలిచిన తెలంగాణ.. 500 గిగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలన్న భారత దేశ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తోందన్నారు. రాష్ట్రంలో రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, మూసీ నదీ పరీవాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుల విశేషాలను వివరించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు సుస్థిర సాంకేతికతను కలిగి ఉంటాయన్నారు. పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేయడానికి చేపట్టనున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ ప్రాజెక్టులు హరిత విద్యుదుత్పత్తికి విస్తృత అవకాశాలు కల్పిస్తాయన్నారు.

పెట్టుబడులకు ఆహ్వానం

సుమారు 40 మందికి పైగా ఔత్సాహిక పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలపై చర్చించారు. జర్మనీకి చెందిన గిజ్, టాటా పవర్, సెమ్‌కార్ప్, వెల్‌స్పన్, రెన్యూ పవర్, ఇండియా ఆయిల్, ఎస్‌హెచ్‌పీసీ, ఐఐటీ బాంబే, ఓనిక్స్, హీరో పవర్, ఊర్జా ఎనర్జీ, కేజీఎం వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయి. రాష్ట్రంలో పెట్టుబడులకు పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరచడంతో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తికి చేసిన ప్రణాళికలను భట్టి కేంద్ర మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో డిస్కంల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్ రెడ్డి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

సమీకృత గురుకులాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష!

ప్రత్యేక విధానం తీసుకురావడంపై సర్కారు దృష్టి

- ఐదో తరగతి మొదలు కళాశాలలకు సెట్
- పాత గురుకులాలకు ప్రస్తుత నిబంధనలే కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు గురుకుల సొసైటీలు వాటి పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేవి. అన్ని తరగతుల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టగా.. సీట్లు మిగిలిన సందర్భాల్లో స్పాట్ అడ్మిషన్ల విధానం ద్వారా పూర్తిస్థాయిలో సీట్లను భర్తీ చేసేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించనున్న సమీకృత గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చే అంశంపై అధికారులు దృష్టి సారించారు. సాధారణ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు ఇప్పుడున్న నిబంధనలు కొనసాగిస్తూనే.. సమీకృత గురుకులాలకు మాత్రం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని భావిస్తున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచే..

గురుకుల విద్యా సంస్థల్లో ఇప్పటివరకు జరుగుతున్న ప్రవేశాలకు అర్హత పరీక్షలు ఒక్కో సొసైటీ ఒక్కో విధంగా నిర్వహించేది. కేవలం ఐదో తరగతికి మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు ఉమ్మడిగా ప్రవేశ పరీక్ష నిర్వహించినప్పటికీ.. ఫలితాలు ప్రకటించిన తర్వాత విద్యార్థులు దరఖాస్తు సమయంలో ఎంచుకున్న సొసైటీకి రిజర్వ్ చేస్తూ ఆ మేరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయితే ఇకపై సమీకృత గురుకుల పాఠశాలలన్నిటికీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలే నిర్వహిస్తారు. ఐదో తరగతి మొదలు, 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్మీడియట్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్ల ప్రక్రియంతా ఉమ్మడిగానే నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో తొలి విడత కింద 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 సమీకృత గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈమేరకు ఆయా జిల్లా కలెక్టర్లకు భూలభ్యత, ఇతర వసతులకు సంబంధించి సూచనలు ఇవ్వగా.. కలెక్టర్లు సైతం ఇప్పటికే పూరిస్థాయి నివేదికలు పంపినట్లు సమాచారం. ఒక్కో సమీకృత గురుకులాన్ని కనిష్టంగా 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలుంటాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సమీకృత గురుకులాల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. నెల రోజుల్లోగా డిజైన్లు పూర్తి చేయాలని కమిటీ సూచించగా..అవి కూడా ఇప్పటికే తయారైనట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సమీకృత గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది.



హ్యాండ్‌బాల్‌లో రెండోస్థానం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం రాత్రి వరంగల్‌లో జరిగిన పోటీల్లో ఫైనల్‌లో ఆదిలాబాద్ జట్టు చేతిలో ఓడింది. కాగారెండోస్థానంలో నిలిచిన జట్టును హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసుందర్‌రెడ్డి, చైర్మన్ గోవింద్‌నాయక్ అభినందించారు. భవిష్యత్‌లో విజేతగా నిలిచేందుకు కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు.

– జడ్చర్ల టౌన్

యోగాలో ఉమ్మడి జిల్లాకు 14 పతకాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిసిన 11వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ఉమ్మడి జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాల్‌రాజు సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు 5 బంగారు, 5 రజతం, 5 కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ 3వ చాంపియన్‌షిప్‌ను సాధించినట్లు తెలిపారు. వరుణ్ (అండర్ 14–16 విభాగం), స్వప్న (8–21), బాలమణి, ప్రకాశ్ (25–30)కు బంగారు పతకాలు, శ్రీనిష్ (అండర్ 8–10 విభాగం), సంజయ్ (10–12), అఖిల్ (14–16), మధు (18–21), వెంకటేశ్ (35–40) రజత పతకాలు, మణిదీప్ (అండర్ 8–10), చరణ్ (12–14), తిరుపతి (14–16), సాగర్, శ్వేత (18–21) కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు : జూరాలకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో మరింత తగ్గు ముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి కేవలం 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వివరించారు. కాగా 9 యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ మేరకు 22, 241 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నారు. మొత్తంగా 24, 695 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.275 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


నిండుకుండలా జూరాల

నిరంతరాయంగా విద్యుత్‌ఉత్పత్తి

ఆత్మకూర్: జూరాల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో.. నిరంతరాయంగా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. సోమవారం 9 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఇప్పటివరకు 323.034 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని వివరించారు.

శ్రీశైలంలో నీటిమట్టం 882.5 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 882.5 అడుగుల వద్ద 202.0439 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 38,685 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. భూగర్భ కేంద్రంలోనూ, ఏపీ జెన్‌కో పరిధిలోనూ విద్యుత్ ఉత్పత్తికి మొత్తంగా 67,983 క్యూసెక్కుల వినియోగిస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 32,708 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 16.912 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14,650 మి.యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు.

మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో మూడు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 13,683 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..11,238 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ కరాటేలో దామోదర్‌కు గ్రాండ్ చాంపియన్‌షిప్

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్లలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో శిక్షణ తీసుకుంటున్న దామోదర్ మెరుగైన ప్రతిభకనబరిచి గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్ తెలిపారు. పోటీల్లో దామోదర్ కతాస్ విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్ పొందారన్నారు. అలాగే బ్లాక్‌బెల్టు వెపన్ విభాగంలో స్పర్ష పవర్ ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. విద్యార్థులను జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ కృష్ణయ్య, సీనియర్ మాస్టర్ ఇలియాజ్ బిన్ సిద్ధిఖీ, శివకుమార్, టోర్నీ ఆర్గనైజర్ సయ్యద్ అక్బాక్ అభినందించి గ్రాండ్ చాంపియన్ ట్రోఫీ అందజేశారు.



కూల్చడం కాదు.. కట్టడం నేర్చుకో


వట్టెం పంప్‌హౌస్‌ను పరిశీలించిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై ఇంత నిర్లక్ష్యమా?
- వట్టెం పంప్‌హౌస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చడం కాకుండా, ప్రాజెక్టులు నిర్మించడం నేర్చుకోవాలని హితవు పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం రిజర్వాయర్ వద్ద ఇటీవల వరదనీటికి నీటమునిగిన పంప్‌హౌస్‌ను పరిశీలించి మాట్లాడారు. పంప్‌హౌస్‌లో రూ.2 వేల కోట్ల విలువైన మోటార్లను సంరక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని చెప్పారు. పంప్‌హౌస్‌లో మొత్తం 19 మీటర్ల మేరకు నీటితో నిండిపోగా, గత పది రోజులుగా కేవలం మీటరు లోతు నీటిని మాత్రమే ఎత్తిపోశారన్నారు. ఇలా అయితే నీటి తొలగింపునకు, మోటార్ల మరమ్మతులకు ఎన్ని నెలలు పడుతుందని ప్రశ్నించారు. నెలల తరబడి నీటమునిగిన మోటార్లు సామర్థ్యం మేరకు పనిచేయడం కష్టసాధ్యమేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి వట్టెం పంప్‌హౌస్‌ను సందర్శించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ కింద డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణానికి పనులు వేగవంతం చేసి రైతులకు నీరందించాలని కోరారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తున్న రేవంత్ సర్కారు కష్టించిన సొమ్ముతో నిర్మించుకున్న సామాన్యులకు పరిష్కారం చూపాలన్నారు.

విచ్చలవిడిగా కల్తీ కల్లు, గంజాయి వినియోగం

నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్తీ కల్లు దందా, గంజాయి వినియోగం విచ్చలవిడిగా సాగుతోందని నాగం విమర్శించారు. ప్రమాదకరంగా ఆల్ఫ్రాజలం విని యోగించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మాట్లాడుతూ జిల్లాకు చెందిన కల్తీకల్లు ని ర్వాహకుడు ఆల్ఫ్రాజలం వినియోగంలో పట్టుబడి తీహార్ జైలులో ఉన్నాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని అన్నారు. జిల్లాలోని కల్లు దందాలో కల్తీ జరిగినట్టు గతంలోనే ఎక్సైజ్ శాఖ నిర్ధారించిందని చెప్పారు. అక్రమంగా సాగుతున్న కల్తీ కల్లు, ఇసుక దందాలను అరికట్టాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే కు లేదా? అని ప్రశ్నించారు. ధాన్యం టెండర్ల కోసం హైకోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి జిల్లాలో దాపు రించిందని మండిపడ్డారు.కల్తీ కల్లు, అక్రమ బెల్లం వ్యాపారం, ఇసుక దందాలు స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండానే సాగుతున్నాయా? అని ప్రశ్నించారు. బాలాగౌడ్, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

ఆచారాలకు తగిన ప్రచారం అవసరం


గోశాలను సందర్శించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల
- గోశాల నిర్మాణం పరిశీలించిన ఎమ్మెల్యే విజయుడు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఆచార, సాంప్రదాయాలు ఎంతో బాగున్నాయని, ఆచారాలకు తగిన ప్రచారం కూడా అవసరమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో జోగుళాంబ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా.. అందించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అనంతరం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ మాట్లాడుతూ.. జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఉత్సవాల ప్రచారాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా చేపట్టాలన్నారు.

'నవబ్రహ్మ గోశాల'గా నామకరణం..

అలంపూర్ ఆలయ సముదాయంలో ఇటీవల నిర్మించిన గోశాలకు నవబ్రహ్మ గోశాలగా నామకరణం చేస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ప్రకటించారు. ఇక్కడి ప్రాంత వైశిష్ట్యం, క్షేత్రం గొప్పదనాన్ని చాటి చెప్పేలా గోశాలకు పేరు పెట్టాలనే ప్రధాన అర్చకుడి సూచనల మేరకు నవబ్రహ్మ గోశాలగా నామకరణం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చిన్నకృష్ణయ్య, వెంకట్రామయ్య శెట్టి, శేఖర్‌రెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మల్దకల్: ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన సోమవారం మద్దెలబండలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నేతోనిపల్లెకి చెందిన ఆశన్న(35) మద్దెలబండకి చెందిన ఈదమ్మతో 16 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహం అనంతరం ఆశన్న భార్య స్వగ్రామం అయిన మద్దెలబండలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. ఉదయం భార్య ఈదమ్మ భర్తను నిద్రలేపే క్రమంలో నోట్లో నుంచి నురగ వచ్చి మృతిచెంది ఉన్నాడు. అనుమానం కలిగిన ఆమె పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఈదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.